# మూసలో బొమ్మ

"హ్యాపీ న్యూ ఇయర్ డాడీ" బుల్లి బుల్లి చేతులతో నా మొహం తడుముతూ లేపుతున్నాడు చిన్నా.

కళ్ళు తెరిచి వాడిని ముద్దు పెట్టుకొన్నాను. చేతిలోని చాకొలేటు నా నోట్లో పెట్టబోయాడు మొహం పక్కకు తిప్పుకున్నాను.

"వద్దు నాన్నా. ఇంకా పళ్ళు తోముకోలేదుగా."

"త్వరగా లేవండి డాడీ. బ్రేక్ ఫాస్టులో ఈ రోజు అమ్మ కేక్ పెట్టిందట."

నాకు నవ్వు వచ్చింది. పబ్లిక్ స్కూలు చదువు. పట్టణవాసం. వీడి కల్చరు వేరు. నా చిన్నప్పటి కల్చరు వేరు. పక్క మీద నుండి లేచి కింద కాలు అన్నానో లేదో ఫోన్ గింగురుమంది. అప్పుడే కొత్త సంవత్సరం శుభాకాంక్షలు ప్రారంభమా అనుకొంటూ ఫోనెత్తాను. అలవాటుగా నా కళ్ళు గోడమీద గడియారాన్ని చూశాయి. ఆరున్నర అయింది.

"హలో."

"హలో. నేను వేణును మాట్లాడుతున్నాను. సతీష్ భార్య పోయింది."

"అరె. ఎప్పుడూ?"

"రాత్రట. వాళ్ళబ్బాయి ఇప్పుడే వచ్చి చెప్పాడు. తెలిసిన వాళ్ళందరికీ చెబుతున్నాను. నువ్వు త్వరగా వస్తావా?"

"ఒక అరగంటలో వచ్చేస్తాను."

బాత్‌రూమ్ వైపు వెళ్తూ వంటింట్లోకి చూశాను. సరిత కాఫీ తయారీలో ఉందేమో నన్ను నవ్వింది. "హాపీ న్యూ ఇయర్". నేను నవ్వలేకపోయాను. "మనం త్వరగా సతీష్ ...లి."

..." చేస్తున్నపని ఆపి నా దగ్గరగా వచ్చింది.

...."

...ఎప్పుడు?"

...ాత్రట. వేణు ఫోన్ చేశాడు".

"సరే మీరు త్వరగా మొహం కడుక్కొని కాఫీ తాగండి. తర్వాత బయలుదేరుదాం."

చిన్నాకు టిఫినూ అదీ పెట్టమని పార్వతికి చెప్పి నేనూ సరితా బయలుదేరాం.

మా ఇంటికీ సతీష్ ఇంటికి పది కిలోమీటర్ల దూరం ఉంటుంది. నగరదూరాల దృష్ట్యా అది దగ్గరే. వేణు సతీష్ ఉంటున్న కాలనీలో ఉంటాడు గాని మరో బ్లాకులో. మేమందరం ఒకే ఆఫీసులో పనిచేసే వాళ్ళం. మా స్నేహం పన్నెండేళ్ళనాటిది.

మొదట మా పరిచయమయ్యే నాటికే సతీష్‌కు పెళ్ళయింది. మేమందరం బాచిలర్స్. తనకు పెళ్ళయిందని తెలియగానే మేమెన్నో జోక్స్ వేశాం. ఆ రోజుల్లో మేము ఆన్ జాబ్ ట్రైనింగ్‌లో ఉన్నందున హాస్టల్లో కలిసి ఉండేవాళ్ళం. అప్పుడే సతీష్ సిగ్గుపడుతూ చెప్పాడు కాలేజీ చదివే రోజుల్లోనే తనకు పెళ్ళయిందని. మేనత్త కూతురట. తల్లిదండ్రులకు ఏకైక సంతానం.

మరో రెండు మూడేళ్ళకు మా అందరికీ కుటుంబాలు ఏర్పడ్డాక మొదటిసారిగా సతీష్ తన భార్యను తీసుకొని మా ఇంటికి వచ్చాడు. సరిత మా డిపార్టుమెంటులోనే పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరు. స్మార్ట్ గర్ల్. మా ప్రేమ, వివాహం అదంతా ఇంకో కథ.

సతీష్ భార్య పేరు సావిత్రి. పట్టు చీర కట్టింది. కాని చాలా కలగాపులగంగా కట్టింది. మెరిసే రాళ్ళ నగలు. చేతిలో చెమ్కీ పర్సు, పెదవులపై పట్టే చెమటను చీర కొంగుతో తుడుచుకొంటూ చాలా బిడియంగా కూర్చుంది. ఎన్నో మాటలకు ఒక మాట జవాబిచ్చేది. అంత పబ్లిక్ రిలేషన్సులో స్పెషల్ ట్రైనింగు పొందిన సరిత కూడా సావిత్రి ముందు ఓడిపోయింది. అసలు కారణం తనకూ అర్థమైంది. నాకూ అర్థమైంది. సావిత్రి పల్లెటూరి

పిల్ల. చదువు కూడా అంతంత మాత్రమే. ఈ నాగరిక ప్రపంచంలో ఇమడలేక పోతోంది. ఆడపిల్లలందరూ సినిమాతారల్లా ఉండాలని అనను కానీ సావిత్రి ఓ మోస్తరుగా కూడా లేదు. "అందరూ అందంగానే ఉంటారు. కాస్త గ్రూమింగ్ అవసరం" అంటూ ఉంటుంది సరిత. బహుశా ఆ అమ్మాయిలో అది లేకపోయి ఉండొచ్చు.

సతీష్‌వాళ్ళకు ఆ ఏడాదే ఒక అబ్బాయి పుట్టాడు. మేము వాళ్ళింటికి వెళ్ళాం. పిల్లాడికి బహుమతులూ అవీ ఇచ్చి వచ్చాం. అప్పుడు సావిత్రిలో ఒక విధమైన కళ కనిపించింది. మాట్లాడటం తక్కువైనా చిరునవ్వు నవ్వుతూ కూర్చుంది. ఆ బిడియం పోయింది. చాలా సహజంగా ఉంది.

మరో ఏడాదికి గాని వాళ్ళింటికి వెళ్లటం పడలేదు. అప్పుడు సావిత్రి పూర్తిగా మారిపోయింది. ఒకే మాటలు, కుర్రాడితో ముచ్చట్లు, అదమాయింపులు, మాతో కబుర్లు. సరిత నవ్వుతూ అంది. "మాటలు రాని మీకు మీ అబ్బాయి మాటలు నేర్పినట్లున్నాడు". సావిత్రి నవ్వింది. "రోజంతా వీడి వెంటపడి ఒరే అది లాగొద్దు, ఇది పగులగొట్టకు, ఇలా కూర్చో, అలా తిను అని వాగి వాగి అలవాటయింది."

మరో రెండేళ్ళకు సావిత్రికి కూతురు పుట్టింది. అప్పుడే మా కుటుంబంలోకి చిన్నా వచ్చాడు. ఆ తర్వాత సావిత్రి ఆరోగ్యం పాడవుతూ వచ్చింది. సతీష్ మాతో చెప్పేవాడు తనకేవో పరీక్షలూ అవీ చేయిస్తున్నట్టు. మనిషి తొణకడు. చాలా బాలెన్స్ ఉన్నవాడు. గడచిన రెండేళ్లుగా ఇంచుమించు సావిత్రి పక్కమీద నుండి లేపలేదనవచ్చు.

సతీష్ స్వయంగా పిల్లలను చూసుకుంటూ, భార్యకు సపర్యలు చేస్తూ, వైద్య పరీక్షలకు తీసుకెళ్తూ ఆఫీసు పనులు చేస్తూ ఉండేవాడు. ఎంత స్నేహ సంబంధాలున్నా ఎవరి జీవితాలు వాళ్ళవి, ఎవరి కష్టాలు వాళ్ళవి కదా! అతని బాధలు చూసి మేము బాధపడేవాళ్ళం. తన వాళ్ళలో ఎవరూ ఇక్కడొచ్చి ఉండి అతని సంసారాన్ని చూసుకొనే వాళ్ళులేరు. అన్ని బాధల్లో ఉన్నా అతని చిరునవ్వు చెరగలేదు. డాక్టర్లు ఆశవదులుకొన్నారని, సావిత్రికి ఎన్నాళ్లు రాసి పెట్టి ఉంటే అన్నాళ్ళు బతుకుతుందని తనకు తెలుసు. నాతో అన్నాడు కూడా. కాని ఈ విషయం సావిత్రికి మాత్రం తెలీదు.

క్రితం నెలే అనుకోకుండా వాళ్ళింటికి వెళ్ళాం. సతీష్ లేడు. సావిత్రి పడుకొన్నదల్లా లేచి వచ్చి మాతో పాటు కూర్చుంది. "మీకెందుకు శ్రమ? మీరు పడుకోండి. పిల్లలని పలకరించాలని వచ్చాం" అన్నాం.

"ఫర్వాలేదు. నాకేమయిందిప్పుడు? ఇంతమాత్రం తిరగగలను. అదెం బలహీనతో వదలటం లేదు. తినని మందూ లేదు. చేయించుకోని పరీక్షా లేదు."

"తిండీ, అదీ బాగా తింటున్నారా? పళ్ళూ పాలు.." సావిత్రి సరిత మాటకు అడ్డువచ్చింది.

"వీళ్ళనాన్నగారు పాపం అన్నీ అమరుస్తారు. కాని రుచించవు. బలవంతాన తిన్నా డోకు వస్తుంది. ఏం మాయదారి రోగమో! ఇక ఇలా బండి లాక్కురావలసిందే. ఏదో పిల్లలు కాస్త పెద్దవాళ్ళయితే..." తన చెంగుతో దాగుడు మూతలాడుతున్న కూతురి తల నిమురుతూ నవ్వింది.

ఇంతలో పని అమ్మాయి టీ, రకరకాల బిస్కెట్లు తెచ్చి పెట్టింది.

"ఇవన్నీ ఇప్పుడెందుకండీ" అన్నాను.

"ఇదేమంత భాగ్యం? మీరు ఇటు వచ్చేదే అరుదు మీకు తీరదు గనుక. నాకు రావాలని ఉన్నా మేడమెట్లు ఎక్కలేను, దిగలేను. ఏదో రెండు రోజులుగా కాస్త బాగానే ఉంది. కొత్త సంవత్సరం నాడయినా మీ ఇంటికి వస్తాను."

నేనేమి ఆలోచిస్తున్నానో సరితా అదే ఆలోచిస్తున్నట్టుంది. కారుకు బ్రేకు పడగానే ఉలిక్కి పడి చూసింది. సతీష్ ఇల్లు వచ్చేసింది. ఇద్దరం లోపలికి వెళ్ళాం.

అన్ని తతంగాలూ స్నేహితులందరం కలిసి చేశాము. పిల్లల్ని పక్కింటివాళ్ళు తీసుకెళ్ళినట్టున్నారు. సతీష్ మొహం గంభీరంగా ఉంది. సావిత్రి చితికి నిప్పంటించేటప్పుడు మాత్రం భోరున ఏడ్చేశాడు. ఆ తర్వాత నా చేతుల్లో వాలిపోయాడు. "గడచిన ముప్పయి ఏళ్ళగా ఉన్న బంధం ఈనాటితోసరి. తను పుట్టినప్పుడు చూశాను. చిన్నప్పుడు ఆడుకొన్నాను. చివరకు..."

"ఊరుకో, ఊరుకో అన్నీ తెలిసినవాడివి ఇలా బెంబేలు పడితే ఎలా? పిల్లల గురించి కూడా ఆలోచించాలి" అని ఊరడించాను.

మేము స్నేహితులం అందరం కలిసినప్పుడు సతీష్ గురించి మాట్లాడుకొనే వాళ్ళం. అతని భవిష్యత్తు ఏమిటి? అంత మంచివాడికి ఈ కష్టాలేమిటి? అతని పిల్లల భవిష్యత్తు ఏమిటి అని తర్జనభర్జనలు చేసుకొన్నాం. అందరి మనసుల్లో ఏదో ఒక మాట మెదులుతోంది. కాని పైకి అనటానికి ఎవరం సాహసం చెయ్యలేకపోయాం.

ఒకరాత్రి సరిత హఠాత్తుగా అంది "సతీష్ పెళ్ళి చేసుకొంటే బాగుంటుంది."

"పెళ్ళా?" అది అనుమానమో, భయమో నాకే అర్థం కాలేదు.

"అవును. అతని వయసెంత? ముప్పయి ఐదేళ్ళకే జీవితం ముగిసిపోతుందా?"

"పిల్లలు?"

"పిల్లలకేం? పెరుగుతారు. ఇంట్లో అమ్మ ఉంటే వాళ్ళ ఆరోగ్యానికే మంచిది."

"ఎంతయినా వచ్చే ఆవిడ స్వంత తల్లవుతుందా? పిల్లలను నిర్లక్ష్యం చేస్తే..."

సరిత కళ్ళు విప్పార్చుకు నన్నే చూస్తోంది.

"మీరేదో పేదరాసి పెద్దమ్మ కబుర్లు చెబుతున్నారు. సవతి తల్లి అంటే కథల్లో, సినిమాల్లో ఉండే రాక్షసి అనుకొన్నారా లేక స్నోవైట్, సిండ్రెల్లాల మారుతల్లి అనుకొన్నారా? కాస్త చదువుకొని బుద్ధి జ్ఞానం ఉన్న వాళ్ళెవ్వరూ పసి పిల్లలకు అన్యాయం చెయ్యరు. స్వంత తల్లయినా పిల్లల్ని ఆదుపాజ్ఞలో పెంచుతుంది. అదే మారుతల్లి అయితే ఎన్నో అనుకొంటాం."

"అయినా సతీష్ ఇప్పుడు పెళ్ళి చేసుకోటం..."

"మరి సతీష్ సమస్యకు సమాధానమేమిటో చెప్పండి. అతను పిల్లల పెంపకమే చూస్తాడా, ఉద్యోగమే చూస్తాడా? అసలు అతనికీ అంటూ వ్యక్తిగత జీవితమే లేదా? పిల్లలు ముఖ్యమే కాని తన జీవితమూ ముందుందిగా. గడిచిన ఆరేళ్లుగా అతను బాధలేగాని సుఖమనేది ఏమాత్రమైనా చవి చూశాడా? బ్రతుకంటే ఇంతేనా? ఎన్ని కష్టాలు పడితే అంతగొప్పగా జీవించినట్టు లెక్కా? ఇప్పుడు అతను పెళ్ళి చేసుకొంటే ఎవరికేమి నష్టం?"

"పోనిద్దూ. అతని సమస్య అతను చూసుకొంటాడు."

"మరి స్నేహితులున్నది ఎందుకు? మంచో చెడో సలహాలు కూడా ఇవ్వలేరా?"

మరో ఆరు నెలలు గడిచాక సతీష్ మా ఇంటికి వచ్చినప్పుడు సరితే అతణ్ణి ఈ విషయమై కదిపింది.

అతని ముఖం ఎర్రగా ఐపోయింది.

"మీ ఫీలింగ్స్, ఎమోషన్స్ మేము అర్థం చేసుకోలేదని కాదు. కాని జ్ఞాపకాలతో బ్రతుకు గడవదు కదా! మీకై మీరు ఆనందాన్ని, సుఖాన్ని త్యాగం చేసినంత మాత్రాన ఎవరికీ లాభం లేదు కదా!"

తర్వాత స్నేహితులం అందరం కలిసి అతనికి తగిన అమ్మాయి ఎవరా అని ఆలోచించసాగాం. ఇంతలో కొత్త సంవత్సరం వచ్చింది.

"హాపీ న్యూ ఇయర్ డాడీ" అన్నాడు చిన్నా నాకు గ్రీటింగ్ కార్డు అందజేస్తూ. వాడిప్పుడు మూడో తరగతిలో ఉన్నాడు.

"థ్యాంక్యూ" అన్నాను వాడిని ముద్దు పెట్టుకొంటూ. క్రిందటి ఏడు గుర్తొచ్చింది. ఆ రోజు ఎలా ప్రారంభమయిందో తలచుకొంటే ఇప్పటికీ బాధనిపిస్తుంది. మా వాడికి నేను కొన్న బొమ్మల పుస్తకాలిచ్చాను. మేము టిఫిన్ చేస్తున్న టైమ్‌లో సతీష్ వచ్చాడు.

న్యూ ఇయర్ గ్రీటింగ్స్, టిఫిన్లు ముగిశాక సతీష్ చెప్పాడు. "రాధా, నేను పెళ్ళి చేసుకొంటున్నాం."

నాకు నోట మాట రాలేదు. సరిత కూడ ఆశ్చర్యపోయినట్లుంది. రాధ మా ఆఫీసులో సేల్సు మేనేజరు. తను చేరి నాలుగేళ్ళయి ఉంటుంది. వెరీ చార్మింగ్ అండ్ యంగ్ గర్ల్. మా మొత్తం ఆఫీసులో ఆమె అంటే ముచ్చటపడని వారు లేరు.

"కంగ్రాచ్యులేషన్స్" అన్నాను తేరుకొని.

"ఐయామ్ వెరీ హాపీ" అంది సరిత.

ఈ వార్తవిని మా స్నేహ బృందం ఆశ్చర్యపోయింది. చివరకు రమేష్ ఉండబట్టలేక అననే అన్నాడు. "సతీష్ అదృష్టవంతుడు. తంతే బూరెల బుట్టలో పడ్డట్టయింది." మాలో కొందరు నవ్వారు. మరి కొందరు "చాల్లే ఊరుకో" అని మందలించారు.

సతీష్ పెళ్ళి నిరాడంబరంగా జరిగింది. మేమందరం వెళ్ళి గ్రీటింగ్స్ చెప్పి, బహుమతులు ఇచ్చాం.

"ఇక ఇతని కష్టాలు గట్టెక్కినట్లే" అంది వేణు భార్య.

"ఆమె ఎంత అందంగా ఉంది!" అని ఆశ్చర్య పోయింది రమేష్ భార్య.

"పిల్లల్ని బాగా చూసుకొంటే చాలు. అసలే తల్లి లేని పిల్లలు" అని నిట్టూర్చింది రామన్ భార్య.

"అతను పెళ్ళి చేసుకొన్నదే అందుకు కదా" అని తేల్చి చెప్పింది వేణు భార్య.

దానితో మేమంతా చాలా గిల్టీగా ఫీలయ్యాం. ఏదో తప్పు చేస్తున్నట్టనిపించింది. మొన్నమొన్నటి దాకా సావిత్రి మా మధ్య ఉండేది. తను పోయి సంవత్సరం అయిందో లేదో మేము ఉల్లాసంగా కబుర్లు చెప్పుకొంటూ సతీష్ ఏర్పాటు చేసిన వివాహ భోజనం ఆరగిస్తున్నాం.

ఆ తర్వాత సతీష్, రాధ చాలా రోజులు సెలవు మీద ఉన్నారు. ఏవేవో ఊర్లు తిరుగుతున్నట్టున్నారు. పిల్లలిద్దర్నీ వాళ్ల అమ్మమ్మ వద్ద వదిలిపెట్టారు వాళ్ళకు సెలవులేగనుక.

మా మిత్ర బృందం వాళ్ళమాట వస్తే మాత్రం చాలా నిర్లిప్తంగా వీళ్ళింకా రాలేదే అనుకొనేది. కాని పైకి చెప్పని మాటలు ఎన్నో ఉన్నాయి. "బాగా ఎంజాయ్ చేస్తున్నట్టున్నారు. సతీష్ పని రొట్టెవిరిగి నేతిలో పడ్డట్టయింది. అంతకెరీర్ ఓరియెంటెడ్ గర్ల్ సతీష్‌కు భార్యకాగలదు గాని పిల్లలకు తల్లెలా అవుతుంది? సునాయాసంగా సతీష్ సంపాదన రెట్టింపయింది" వగైరా, వగైరా... కాని నోరు మెదిపి ఆ మాట మాత్రం అనేవాళ్ళం కాదు.

రాధ, సతీష్ వాపసు వచ్చారు. మా ఇంటికి వచ్చారు. చలికాలమేమో చక్కటి డిజైను ఉన్న ఎర్రటి ఊలు స్వెట్టరు ఆ అమ్మాయి వేసుకొంది. హైనెక్ పైగా బంగారం రంగులో నాజూగ్గా ఆ అమ్మాయి మెడ మెరుస్తోంది. బ్లూ జీన్సు, మృదువుగా, అందంగా, లేతగా, పూతీగలా కనిపిస్తోంది రాధ. నయన్‌తాల్, రాణిఖేత్ ఇంకా ఎక్కడెక్కడో కొండ ప్రాంతాలన్నీ తిరిగి వచ్చారేమో ఆ అమ్మాయి బుగ్గలు గులాబీల్లా ఉన్నాయి. సతీష్ మాత్రం... అతని ముఖం ఆనందంతో మెరిసిపోతోంది. అతని కళ్ళలో ప్రేమ చిప్పిలుతోంది.

ఏవేవో జోక్సు, కబుర్లు... పైకి మాత్రం లోలోపల నాలో ఏదో గడ్డ కట్టుకుపోతున్న భావన.

వాళ్ళిద్దరూ వెళ్ళాక సరిత అంది. "ఇద్దరూ చాలా ఆనందంగా ఉన్నారు. సతీష్‌ను ఇంత రిలాక్స్‌డ్‌గా సంతోషంగా గడచిన పదేళ్ళలో నేనెప్పుడూ చూడలేదు."

"ఇతని పని బాగానే ఉందిగాని పిల్లల గురించే నా బాధ."

"వాళ్ళకేం? చదువుకొన్న తల్లి ఉంటే భవిష్యత్తు బాగుపడక ఏమవుతుంది? మనందరం సతీష్ ఆనందాన్నే కోరుకొన్నాం కదా? మరి అతను ఆనందంగా ఉంటే మనకు బాధెందుకు? అంత బిజినెస్ మేనేజిమెంట్ తెలిసిన రాధకు తన ఇల్లు ఎలా నడుపుకోవాలో తెలీదంటారా?"

ఒకరోజు వేణు, అతని భార్య, పిల్లలు మా ఇంటికి వచ్చారు. ఆ రోజు దేనికో సెలవు. బహుశా జైనుల పండుగ అనుకొంటా. మా ఇంటికి 'జూ' దగ్గర. అందుకని పిల్లల్ని తీసుకొని జూకు వెళ్ళాం. ఇటూ, అటూ తిరిగి, ఇవీ, అవీ తిని చెట్ల నీడల్లో పచ్చికమీద కూర్చున్నాం. పిల్లలు గెంతుతూ, పరుగెత్తుతూ, అరచుకొంటూ ఆనందంగా ఉన్నారు. ఉండి, ఉండి

పక్కనున్న జింకల దగ్గరకు వెళ్లి వాటిని చూస్తున్నారు. పలకరిస్తున్నారు. వాటికి ఆరెంజి పండ్లు పెడ్తున్నారు.

"సతీష్ పిల్లలు కూడా వస్తే బాగుండేది" అంది సరిత.

"నిన్న వాళ్ళింటికి వెళ్ళాం. కాని సతీష్ పిల్లల్ని తీసుకొని సినిమాకు వెళ్ళాడట. రాధ గారేమో టూరు మీద ఉన్నట్టున్నారు."

"పాపం తనది టూరింగ్ జాబ్. నెలకు వారమో, పది రోజులో ఇటూ, అటూ తిరగాల్సి వస్తుంది." అంది సరిత.

"పెళ్ళిగాక ముందంటే పర్వాలేదుగాని ఇప్పుడు సంసారమూ, పిల్లలూ ఉన్న తర్వాత కష్టమే" అంది వేణు భార్య.

"ఏం చేస్తుంది మరి. సీనియర్ ఆఫీసరయ్యే కొద్దీ బాధ్యతలూ ఎక్కువవుతాయి కదా!"

"ఈ పెళ్ళి వల్ల ఎవరికి సుఖం?" అన్నాడు వేణు హఠాత్తుగా. కాస్సేపు మౌనం రాజ్యం చేసింది. ఆ తర్వాత వేరే కబుర్లలో పడిపోయాం.

మరో నాలుగు నెలలు గడిచాయి. రాధకు ప్రమోషన్ వచ్చింది. ట్రాన్స్‌ఫరూ అయింది. సతీష్ నా వద్దకు వచ్చాడు ఈ కబురు మోసుకొని.

"ఇప్పుడెలా? తను ప్రమోషన్ రిజెక్ట్ చేస్తుందా? ట్రాన్స్‌ఫర్ వద్దంటుందా?" అన్నాను.

"అబ్బే. అదెలా కుదురుతుంది? తను గడచిన ఐదేళ్ళుగా రాత్రనక, పగలనక పనిచేసి మన సేల్స్ ఎంత పైకి తీసుకెళ్ళిందో ఎవరికీ తెలీదు? మనందరిలోకీ ఫారిన్ క్వాలిఫికేషన్ ఉన్నది తనకు ఒకదానికే కదా! అవుట్ స్టాండింగ్ మెరిట్ కోసం తనకు ప్రమోషన్ వస్తే దాన్ని వదులుకోమని ఎలా చెప్పగలను?"

"మరి? తనొక చోట, నీవొక చోట... కష్టం కాదా?"

" ఆ విషయం కనుక్కొన్నాను. కాన్పూరు బ్రాంచిలో నాకూ ఓ పోస్టు ఖాళీగా ఉంది. రిక్వెస్టు మీద భార్యాభర్తలను ఒకే ఊరికి ట్రాన్స్‌ఫర్ చేస్తారుకదా!"

"ఓహో మొత్తం ఫామిలీతో వెళ్తున్నావన్నమాట."

"ఫామిలీ ఎక్కడ! నేనూ, రాధే. పిల్లలు ఇక్కడే ఉండాల్సి వస్తుంది."

"ఇక్కడా? ఎవరిదగ్గర?"

"వీళ్ళిద్దరూ మంచి స్కూల్లో ఉన్నారు. బాగా చదువుకొంటున్నారు. ఇప్పుడు డిస్టర్బ్ చేస్తే

ఎలా? కాన్పూర్‌లో ఈ స్కూలూ లేదు. బ్రాంచీ లేదు. సిలబసు వేరు. అందుకే వాళ్ళని ఇక్కడే హాస్టల్లో ఉంచుదామంది రాధ. మూడు, నాలుగేళ్ళకు మాకు ఎలాగూ ఇక్కడికే ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశముంది. అంతవరకు ఎలాగో సర్దుకోవాలి."

నేను నిరుత్తరుణ్ణి అయ్యాను. ఇంత కాఠిన్యమా? కొత్త భార్య మోజులో పడి తన పిల్లల్ని హాస్టల్లో కూడా ఉంచటానికి సిద్ధపడ్డాడా! ఈ మనిషి మొఖంలో రవంతయినా విచారం కనిపించదే! రాధ ఆడింది ఆట, పాడింది పాటా?

అతను వెళ్ళాక సరితతో అన్నాను. "సతీష్ చాలా మారిపోయ్యాడు."

"ఎలాగా?"

"చూడు చివరికి పిల్లల్ని కూడా హాస్టల్లో వదిలి పెట్టిపోతున్నాడు. అతను అసలు పెళ్ళి చేసుకొన్నదెందుకు? పిల్లలకోసం కాదా? ఇప్పుడు రెండో పెళ్ళి అయ్యాక మరీ కొత్త పెళ్ళి కొడుకులా వ్యవహరిస్తున్నాడు."

సరిత అలమార్లో ఏదో పుస్తకం వెతుకుతోంది. ఏం మాట్లాడలేదు.

ఊరు వెళ్ళేముందు పిల్లల్ని తీసుకొని రాధ, సతీష్ వచ్చారు. రాధ గులాబీ రంగుపైన తెల్లపూలున్న షెల్వారు కమీజు వేసింది. సన్నజరీ ఉన్న గులాబీ దుపట్టా. చాలా ఎలిగెంట్‌గా ఉంది. మాటిమాటికి దృష్టి నాకర్షించే విస్ఫారిత నేత్రాలు.

ఆ రోజు వాళ్ళ భోజనాలు మా ఇంట్లోనే. పిల్లలు లోపల ఏవో బొమ్మల పుస్తకాలు చూసుకొంటూ కబుర్లు చెప్పుకొంటున్నారు. మేమందరం డ్రాయింగ్ రూంలో కూర్చున్నాం. రాధ మమ్మల్నిద్దరినీ ఉద్దేశించి అంది.

"పిల్లల్ని మేము ఇక్కడ హాస్టల్లో వదులుతున్నా మీ భరోసాతో వెళ్తున్నాం. మీరే వాళ్ళకు లోకల్ గార్డియన్స్. వాళ్ళ చదువు గురించి కూడ మీరు కాస్త పట్టించుకోండి. ఏ మాత్రం సమస్య వచ్చినా మీరు టెలిఫోనులో చెబితే చాలు మాలో ఎవరో ఒకరం వచ్చేస్తాం. పిల్లలకు కూడా నచ్చజెప్పాను. వాళ్ళు హాస్టల్లో ఉండటానికి ఉత్సాహంగానే ఉన్నారు. వాళ్ళకు ఫ్రెండ్సు కూడా ఉన్నారక్క.డ.

గొప్పగొప్ప వాళ్ళంతా రెసిడెన్షియల్ స్కూల్సులో చదువుకొన్నవాళ్ళే. ఆ మాటకొస్తే నేనూ హాస్టల్లో ఉండి చదువుకొన్నాను. కాస్త సొసైటిలో మెలిగే తీరు. మన పనులు మనం చేసుకోగల శక్తీ అబ్బుతాయి. దానిలో నష్టమేం లేదు."

కథా నిలయం
శ్రీకాకుళం

సరిత నవ్వింది. "నేనూ హాస్టల్లో ఉండి చదివాను. అంతమాత్రంతో మా అమ్మా నాన్నకు ప్రేమ లేదని అర్థమా? నీ ఎఫిషియన్సీ, ప్రొఫెసనల్ అప్రోచ్ చూస్తే రేపు నీకు పుట్టబోయే బిడ్డ చదువు కూడా ఇలా సాగుతుందని అర్థమైపోతుంది."

రాధ మనోహరంగా నవ్వింది. మొహంలో వింతయిన వెలుగొచ్చింది.

"ఏం చెయ్యాలి! మారుతున్న కాలంతో పాటు మనమూ మారాలి. మన వెనుక తరాల వాళ్ళకు, మనకూ తేడా ఉంది. మనం కెరీర్ కోసం పాటు పడుతున్నాం. ఉద్యోగానికి ఎంత స్పెషల్ స్కిల్ కావాలో, ఇల్లు నడవటిడానికి అంత మెలుకువా కావాలి. అందుకే మన కుటుంబాల్లో అందరూ కొత్త పద్ధతులకు అలవాటు పడవలసి ఉంది."

"నిజమేలే. మన అమ్మల్లా, అమ్మమ్మల్లా ఫుల్ టైమ్ గృహిణులం కాలేం కదా! వీళ్ళందరూ మగమహారాజుల మంటూ కాలుమీద కాలు వేసుకు కూర్చుంటే పనులెలా జరుగుతాయి. అదృష్టవశాత్తూ ఆ రోజుల్లో లేని సౌకర్యాలు కూడా కొన్ని అమిరాయి కాబట్టి ఎలాగో సర్దుకోగలుగుతున్నాం."

"కాని మనుషుల ఆలోచనా పద్ధతి మాత్రం అంతగా మారలేదు" అంది రాధ స్వచ్ఛంగా నవ్వుతూ.

"ఎలా మారుతుంది? మన బుర్రల్లో ఒకోరకమైన రూపాలు పాతుకుపోయాయి. తల్లి అంటే ఎప్పుడూ పిల్లల పనుల్లో సతమతమవుతుండాలి. గృహిణి అంటే లక్ష్మీదేవిలా కళకళలాడుతూ వంటలన్నీ బ్రహ్మాండంగా చేసి, ఇంట్లో అందరికీ అన్నీ అమర్చి, ఇల్లు అద్దంలా పెట్టి ఉస్సురనకుండా ఉండాలి..."

"ఇదంతా టైప్ కాస్టింగ్ సరితా. మనకు మాడల్స్ మన అమ్మలు, అమ్మమ్మలూను. కాదూ... సినిమాలూ, అడ్వర్టయిజుమెంట్లు. ఇవన్నీ ఆడవాళ్ళను ఒక మూసలో పోస్తుంటాయి. ఎవరైనా ఆ మూసలో ఇమడకుండా ప్రాక్టికల్‌గా ఆలోచించి వ్యవహరిస్తే తక్కినవాళ్ళు ఏదో ఉపద్రవం ముంచుకొచ్చిందనుకొంటారు."

"ఆశ్చర్యమేమిటంటే చదువుకొని, ఎన్నో వ్యవహారాల్లో దిట్టలయిన వాళ్ళు కూడా ఇలాగే ఆలోచిస్తారు. అదీ ఆడవాళ్ళ విషయంలో ఎందుకనీ?"

సరిత యధాలాపంగా నా వైపు చూసింది. అయినా ఆ చూపు చురుక్కుమంది.

*(10 ఫిబ్రవరి 1991)*